సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 30 । జూలై । 2023



ఆక్వాలో అగ్రగామి

ఆక్వాలో అగ్రగామిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నిలుస్తోంది. ఏటా సుమారు 8 లక్షల టన్నుల రొయ్యలు ఇక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 8లో ▸



బలిగొన్న ఈత సరదా

ఈత నేర్చుకోవాలన్న సరదా ఓ విద్యార్థి నిండుప్రాణాన్ని బలిగొంది. తమ్మిలేరు చెక్ డ్యామ్ వద్ద నీటిలో దిగి నర్రా శ్రీబాబు మృత్యువాత పడ్డాడు. 8లో ▸



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శనివారం బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ నిర్వహించాయి. క్షేత్ర పరిసరాలను పరిశీలించాయి 8లో ▸

న్యూస్‌రీల్

అంతటా అప్రమత్తం



పాత నవరసపురంలో పరిశీలిస్తున్న జేసీ

నరసాపురం రూరల్: ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి, మండలంలోని పాతనవరసపురం, కొత్తనవరసపురం ఎస్టీకాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో వరద ఉధృతిని పరిశీలించిన లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల వివరాలపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాలకు తరలిరావడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వైద్య శిబిరంలో మందులు అందించాలని, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల వివరాలు సేకరించి వారిని ప్రభుత్వాస్పత్రులకు తరలించాలన్నారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు



శిక్షణ పొందిన విద్యార్థులతో ఎస్పీ

సాక్షి, భీమవరం: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్, లోన్‌యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. నమోదైన కేసుల్లో రికవరీ జరిగిలే దర్యాప్తు ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో పోలీసులు మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం కంప్యూటర్ శిక్షణ పొందిన పోలీస్ కుటుంబాల విద్యార్థుల వృత్తి నైపుణ్యం సర్టిఫికెట్లు అందజేశారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు బండారు శ్రీనాథ్, మనోహరాచారి, శరత్ రాజకుమార్, దిశ డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

దిశ స్టేషన్ డీఎస్పీగా మురళీకృష్ణ



సాక్షి, భీమవరం: జిల్లా దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీగా శనివారం నున్న మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ యు.రవి ప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

భీమవరం కమిషనర్‌గా శ్యామల



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.శ్యామలను నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎస్.శివరామకృష్ణపై ఏసీబీ దాడుల నేపథ్యంలో ఆయన్ను తొలగించారు. ఆ స్థానంలో శ్యామల ఇక్కడకు రానున్నారు. గతంలో భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా శ్యామల పనిచేసిన అనుభవం ఉంది.

కొల్లేరు ప్రాంతాల పరిశీలన

కైకలూరు: కొల్లేరు ముంపు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి శనివారం పరిశీలించారు. ఏలూరు మండలం కోమటిలంక నుంచి ఆటపాకకి నాగరాజుకోడులో శుక్రవారం సాయంత్రం పడవపై వస్తుండగా నీటి ఒరవడికి కొందరు పడవ నుంచి దూకి ఒడ్డుకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ మేరీ ప్రశాంతి శనివారం ఇక్కడ పర్యటించారు.

పరవళ్లు తొక్కుతూ.. లంకలను ముంచుతూ..



నరసాపురం రూరల్: నరసాపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఉగ్ర గోదావరి

- పోలవరం ప్రాజెక్టు నుంచి 12.90 లక్షల క్యూసెక్కులు దిగువకు..
- ముంపు మండలాల్లోని 41 గ్రామాల్లోకి వరద నీరు
- పెద్ద ఎత్తున సహాయక చర్యలు
- లంక గ్రామాలను తాకిన వరద నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి వరద ఉగ్రరూపం దాల్చింది. పది రోజులుగా లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పోలవరం ప్రాజెక్టుకు చేరుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో శనివారం నమోదైంది. 12,90,079 క్యూసెక్కుల నీటిని పోలవరం నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి విడుదల చేశారు. ముంపు మండలాల్లోని 41 గ్రామాలు, పశ్చిమగోదావరిలోని ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక గ్రామాలకు వరద నీరు చేరడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దెత్తున సహాయక చర్యలు కొనసాగిస్తోంది.

జలదిగ్బంధంలోనే 41 గ్రామాలు

పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులోని 41 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వేలేరుపాడులో ఐదు గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. 25 ఇళ్లు పూర్తిగా నీటమునిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని లంక గ్రామాలకు శనివారం వరద నీరు చేరడంతో జిల్లా యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తోంది.

ఏలూరు జిల్లాలో..

కుక్కునూరు మండలంలో ఆర్డీఓ కిషోర్, ఐటీడీఏ పీఓ వీవీ సత్యనారాయణ తదితరులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కుక్కునూరు ఎ బ్లాక్‌లోని ఇళ్లు ముంపు బారిన పడ్డాయి. ఆరు గ్రామాల్లోని 800 మంది కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వేలేరుపాడు మండలంలోని 35 గ్రామాల్లో వరద నీరు చేరింది. 1,693 మందికి పునరావాసం కల్పించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 3,412 కుటుంబాలకు చెందిన 9,637 మంది నిరాశ్రయులయ్యారు. నిత్యావసరాలు, లక్ష మంచినీటి ప్యాకెట్లు, 1,873 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. రెండేసి చొప్పున ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో..

యలమంచిలి మండలంలోని దొడ్డిపట్ల, కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, ఏనుగువాని లంక, బాడవ గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ఆచంట నియోజకవర్గంలో లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఆచంట మండలంలోని అయోధ్యలంక, మర్రిమూల, పెదమల్లంలంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. లంక గ్రామాల్లో ఉన్న కొబ్బరికాయలను రైతులు పడవలపై ఒడ్డుకు చేరుస్తున్నారు.

కలెక్టర్ పర్యటన : మండలంలో వరద ప్రభావితమైన దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, ఏనుగువానిలంక గ్రామాల్లో శనివారం కలెక్టర్ పర్యటించారు. దొడ్డిపట్ల వద్ద గోదావరి ఏటిగట్టును యుద్ధప్రాతిపదికన పటిష్టం చేయాలని ఆదేశించారు. ఏనుగువానిలంక దగ్గర కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులు సక్రమంగా మూసుకోకపోవడంతో వరద నీరు డ్రెయిన్‌లోకి వస్తుంది. స్లూయిజ్ తలుపులను పరిశీలించిన కలెక్టర్ మరమత్తులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



యలమంచిలి: పెదలంకలో ముంపుపై సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



యలమంచిలి: కనకాయలంకలో ముంపులోనే ఇళ్లు



యలమంచిలి: కనకాయలంకలో ఇంటి చుట్టూ చేరిన నీరు

నీట మునిగిన 340 ఇళ్లు

యలమంచిలి: వరద ప్రభావంతో మండలంలోని కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, నారినమెరక, కంచుస్తంభంపాలెం గ్రామాల్లో 340 ఇళ్లు నీట మునిగాయి. కనకాయలంక, పెదలంకకు వెళ్లే ప్రధాన రహదారులు మునిగిపోవడంతో అధికారులు పడవలు ఏర్పాటుచేశారు. దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువన ఉన్న మత్స్యకారకాలనీలో ఇళ్లు ముంపు బారిన పడ్డాయి. లక్ష్మీపాలెంలో గోదావరి ఒడ్డున ఉన్న కాలనీ చుట్టూ వరద నీరు చేరింది. నక్కల డ్రెయిన్ పొంగడంతో నారినమెరక, ఏనుగువానిలంక వద్ద కాజ డ్రెయిన్ స్లూయిజ్ తలుపులు పనిచేయకపోవడంతో వరద నీరు ఎగదన్నుతోంది. దీంతో ఏనుగువానిలంక మత్స్యకారకాలనీ, ఎస్సీ కాలనీలో ఇళ్లు నీట మునిగాయి. వరద బాధితులకు తక్షణ సహాయంగా కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో కందిపప్పు పంపిణీ చేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తెలిపారు.



గోదావరిలో పడవపై వెళుతున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

లంక బాధితులకు బాసటగా..

పోడూరు: ముంపు బారిన పడిన ఆచంట మండలంలోని లంక గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం పర్యటించారు. కోడేరు రేవు నుంచి పడవలో బయలుదేరి వెళ్లి అయోధ్యలంక, మర్రిమూల, పుచ్చలంక, నేతలవారిపేట, రావిలంక గ్రామాల్లో బాధితులను పరామర్శించారు. నీటమునిగిన ఇళ్లను పరిశీలించి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో శనివారం పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. పునరావాస కేంద్రాలు, బాధితులకు భోజన ఏర్పాట్లు, సహాయక చర్యలకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్టు చెప్పారు. వరద బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తామనీ, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ధైర్యం చెప్పారు. ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, మొల్లేటి రామకృష్ణ ఆయన వెంట ఉన్నారు.

వశిష్ట గోదావరి ఉధృతి

నరసాపురం రూరల్: నరసాపురంలో వశిష్ట గోదావరిలో వరద గంటగంటకూ పెరుగుతోంది. పట్టణంలోని అన్ని రేవుల్లో మెట్లపైకి వరద నీరు చేరింది. పట్టణం, రూరల్ పరిధిలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను, మైనర్ స్లూయిజ్‌లను అరెస్టు చేసి అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. లలితాంబ రేవు వద్దనున్న బాపు కళాక్షేత్రం, వలంధర్ రేవులో ఉన్న పిండ ప్రధాన మండపాల్లోకి వరద నీరు చేరింది. ప్రమాదకర పరిస్థితులు లేనప్పటికీ ఆయా రేవుల వద్ద నిరంతరం పోలీసులు పహారా కాస్తున్నారు. నదిలోకి ఎవరూ దిగకుండా చర్యలు తీసుకున్నారు.

ఏటిగట్ల పరిరక్షణకు చర్యలు : గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని ఏటిగట్ల పరిరక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. పట్టణంలోని పాలకొల్లు రోడ్డు వద్ద ఉన్న లాకులు, మండలంలోని దర్బరేవు డ్రెయిన్, బియ్యపుతిప్ప నల్లీక్రీక్ గేట్లు తదితర ప్రాంతాల్లో శనివారం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజతో కలిసి పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టామని, గర్భిణులు, దీర్ఘకాలిక రోగగ్రస్తులు, బాలింతలను ప్రభుత్వాస్పత్రులకు తరలిస్తున్నామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పడవలు, వలలు భద్రపరిచేలా చర్యలతో పాటు మత్స్య సంపదను మార్కెట్‌కు తరలించి అమ్మకం అయ్యేలా చూడాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. విపత్కర పరిస్థితులైన ఎదుర్కొంనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, ప్రజలు ధైర్యం ఉండాలని సూచించారు. వరద పెరిగితే పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని, తుపాను రక్షిత భవనాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహసీల్దార్ ఫాజిల్ వారి వెంట ఉన్నారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



నరసాపురం లలితాంబరేవు వద్ద వరద

పట్టణాలపై 'అమృత్' జల్లులు

- రూ.285.54 కోట్లతో అమృత్ 2.0 పనులు
- జిల్లాలోని ఐదు పట్టణాలు ఎంపిక
- తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం
- వచ్చేనెలలో టెండర్ల ప్రక్రియ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని పట్టణాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకంలో రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నారు. తాగునీటి సురక్షిత పట్టణాలుగా మార్చడంలో భాగంగా నిధులు మంజూరు చేసి వేగంగా పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

జిల్లాలోని ఐదు చోట్ల.. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైప్‌లైన్ల విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం (ఎస్‌టీపీల నిర్మాణం), నీటి సంరక్షణ, అండర్ గ్రాండ్ డ్రైనేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, జగనన్న కాలనీల్లో ఎస్‌టీపీల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు.

మూడు ఎస్‌టీపీలు : జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడు చోట్ల ఎస్‌టీపీలు (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నెలకొల్పనున్నారు. తాడేపల్లిగూడెం, భీమవరం జగనన్న కాలనీల్లో రూ.28.58 కోట్లతో రెండు ప్లాంట్లు, తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.100.20 కోట్లతో మరో ప్లాంట్‌ను నిర్మించనున్నారు.

పట్టణాల వారీగా పనులు

- **భీమవరం:** ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలు, 24 గంటల పాటు తాగునీటి సరఫరా తదితర పనుల కోసం రూ.47.29 కోట్లు కేటాయించారు. భీమవరం జగనన్న లేఅవుట్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.13.39 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- **తాడేపల్లిగూడెం:** నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.41.79 కోట్లు, జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి రూ.12.19 కోట్లు, పట్టణంలో మరో ఎస్‌టీపీ ప్లాంట్ కోసం రూ.100.20 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- **నరసాపురం:** నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు కేటాయించారు.
- **ఆకివీడు:** నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.5.29 కోట్లు, మరో రూ.26.50 కోట్లతో తదితర పనులు చేపట్టనున్నారు.
- **తణుకు:** తణుకు జగనన్న కాలనీలో నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.8.36 కోట్లు కేటాయించారు.



భీమవరం పట్టణ వ్యూ

వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ



జిల్లాలో ఐదు పట్టణాలకు అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరయ్యాయి. తాగునీటి సరఫరా, ఎస్‌టీపీల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల తదితర పనులకు డీపీఆర్‌ల ఆమోదం పొందిన వెంటనే వచ్చేనెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడతాం. ఈ పథకం 2025–26 వరకు కొనసాగుతుంది.

– పి.ప్రశాంతి, కలెక్టర్

గురుకులం.. అత్యాధునికం

- డిప్యూటీ సీఎం చొరవతో రూ.22.17 కోట్ల వ్యయం
- నేడు ప్రారంభోత్సవం



ఆరుగొలనులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గురుకుల పాఠశాల

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలనులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకుంది. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో నాబార్డు, ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.22.17 కోట్లతో కార్పొరేట్ భవనాలకు దీటుగా గురుకుల పాఠశాలను తీర్చిదిద్దారు. విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది నివసించేందుకు వీలుగా క్వార్టర్స్ నిర్మించారు. ఆదివారం మంత్రి కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చేతులమీదుగా నూతన భవనాలను ప్రారంభిస్తారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బీహెచ్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు.

కైకలూరులో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

కైకలూరు: పట్టణంలోని జాగృతి స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు కైకలూరు సీఐ ఆకుల రఘు చెప్పారు. ఇద్దరు విద్యార్థినులు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో కలసి చదువుకున్నారు. ఒక స్నేహితురాలు గత ఏడాది క్రితం జాగృతి స్కూల్‌లో చేరగా, నెల క్రితం మరో స్నేహితురాలు కూడా ఇదే పాఠశాలలో చేరింది. స్థానికుల సమాచారం మేరకు ఇద్దరు విద్యార్థినులు ఎక్కువగా సెల్‌ఫోన్లలో యూట్యూబ్, ఇన్‌స్టాగాంలో రీల్స్ చూస్తుంటారని, అంతే కాక సీరియల్స్‌లో నటించాలనే కోరికను ఇతర స్నేహితులతో పంచుకుంటుంటారని అంటున్నారు. దీనికి తోడు ఓ విద్యార్థిని గతంలో టీవీ సీరియల్‌లో నటించాలని ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరగొచ్చింది. ఎక్కువగా రీల్స్ కూడా చేస్తుండటం, ఇటీవల ఓ యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతోందని ఆమె తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో సీరియల్స్‌లో నటించాలనే ఉద్దేశంతో ఎక్కడికైనా వెళ్లి ఉంటారా అనే కోణంలో సీసీ పుటేజీలను కూడా పరిశీలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శనివారం బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ నిర్వహించాయి. ఆలయ భద్రతలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఆలయంలో ఈ తనిఖీలను చేపడుతున్నారు. అందులో భాగంగా డాగ్, బాంబ్ హ్యాండ్లర్‌లు ఎస్.దుర్గారావు, ఆర్‌జే తంబి, బి.దుర్గాప్రసాద్ డాగ్ రాక్సీతో ఆలయ అనివెట్టి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, మూల మండపాలు, తదితర ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేశారు.



ఆక్వాలో అగ్రగామి.. ఉమ్మడి పశ్చిమ

- పశ్చిమ నుంచి భారీగా రొయ్య ఎగుమతులు
- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో ఆక్వా సాగు
- గతేడాది 3.05 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతి
- వ్యాపారం ప్రతి ఏటా రూ.9 వేల కోట్ల పైమాటే
- రాష్ట్రంలోనే ఆక్వా సాగుకు శ్రీకారం చుట్టింది ఇక్కడే





సాక్షి ప్రతినిధి, ఏలూరు: సహజసిద్ధంగా సముద్ర, నదీతీర పరీవాహక ప్రాంతాల్లో దొరికే రొయ్యలను చిన్నచిన్న మడులతో సాగు ఆరంభించి వేల ఎకరాల్లో అత్యధిక రొయ్యల వెరైటీలను సాగు చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రం, దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశం నుంచి ఏటా సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతుంటే అందులో ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రం నుంచి, దీనిలో 3.05 లక్షల మెట్రిక్ టన్నులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎగుమతి అవుతుండటం విశేషం. రొయ్య సాగుకు రాష్ట్రంలోనే మొదట శ్రీకారం చుట్టింది ఈ జిల్లా ఆక్వా రైతులే. చిన్న చిన్న మడుల్లో రొయ్యలను పెంచి బకెట్ల ద్వారా విక్రయించే స్థాయి నుంచి నేడు డాలర్ల వర్షం కురిపించే స్థాయికి ఆక్వా రంగం జిల్లాలో ఎదిగింది. ఆక్వా విస్తీర్ణం వేల ఎకరాలకు చేరడంతో పాటు హేచరీలు, సీడ్ కంపెనీలు కూడా దీనికి అనుబంధంగా జిల్లాలో ఏర్పాటై ప్రపంచ వ్యాప్తంగా పశ్చిమ రొయ్యకు ఖ్యాతి తెచ్చింది. ప్రత్యక్షంగా వేలాది మంది రైతులు, హేచరీలు, ఫీడ్ కంపెనీల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు జిల్లా ఖ్యాతిని పెంపొందించింది.

ఆక్వా సాగుకు శ్రీకారం ఇలా..

సహజసిద్ధంగా సముద్ర, నదీ తీర పరీవాహక ప్రాంతాల్లో దొరికే చిన్న చిన్న రొయ్యలను మడుల్లో పెంచే రొయ్య సాగుకు 1970వ దశకంలో పశ్చిమగోదావరి, కృష్ణా డెల్టా రైతాంగం శ్రీకారం చుట్టింది. పశ్చిమగోదావరితో పాటు యానాం, ఎదురులంక, ముమ్మిడివరం, చించినాడ, కృష్ణా జిల్లాలోని డెల్టా ప్రాంతంలోని పలు మండలాల్లో చేతి వలల ద్వారా పీఎల్ (రొయ్య రకం)ను సేకరించి, బకెట్ల ద్వారా విక్రయించేవారు. రొయ్య పిల్లల పెంపకానికి మేతగా తవుడు, ఉడకబెట్టిన బంగాళదుంప, చెక్క మేతను వినియోగించేవారు. రొయ్య కొంత బరువు వచ్చాక నత్త మాంసంతో పెంచేవారు. ఇలా ప్రారంభమైన ఆక్వా సాగుకు 1980లో అప్పటి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించింది. మడుల్లో రొయ్యల పెంపకం, సహజసిద్ధమైన పద్ధతుల ద్వారా వ్యాపారం లాభసాటి ఉండదని, వైజాగ్, చెన్నైలో హేచరీలను ఏర్పాటు చేసినప్పటికీ సాగుకు ప్రోత్సాహం లభించలేదు. ఈ క్రమంలో మార్కెట్‌లోకి వచ్చిన టైగర్ రొయ్యపై పశ్చిమ రైతులు దృష్టి సారించడంతో జిల్లాలో టైగర్ రొయ్య కల్చర్ పెరగడంతో పాటు అధిక లాభాలను తీసుకువచ్చే సాగుగా మారింది. ఈ క్రమంలో రైతులే అవసరమైన సీడ్‌ను రొయ్యలకు కావాల్సిన మేతను సిద్ధం చేసుకుంటూ వైరస్‌లను ఎదుర్కొంటూ సాగు చేశారు. 2000 సంవత్సరం నుంచి విదేశీ రొయ్యల సీడ్ హవా ప్రారంభమైంది. అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతం నుంచి తల్లి రొయ్యను దిగుమతి చేసుకున్నారు. 2004 నుంచి జిల్లాలో వనామీ సాగు ప్రారంభమైంది. బ్లాక్ టైగర్ సాగు తగ్గి వనామీ సాగు ప్రారంభం కావడం, వనామీ ద్వారా ఉత్పత్తి వేగం పుంజుకోవడంతో నార్త్ అమెరికా, ఫ్లోరిడా ప్రాంతం నుంచి తల్లి రొయ్య దిగుమతికి జిల్లాలో డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో జిల్లాలో 30 ఎకరాలతో ప్రారంభమైన రొయ్యల సాగు విస్తీర్ణం 72 వేల ఎకరాలకు విస్తరించింది. వందల సంఖ్యలో చెరువులు ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఉన్నాయి. వనామీ సాగు మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో పూర్తయి అంతర్జాతీయంగా మంచి ధరలు లభిస్తే రైతులకు డాలర్ల వర్షం కురుస్తుంది. అప్పటి వరకు జిల్లాలో ఉన్న చేపల చెరువులన్నీ వనామీ కల్చర్ హవాతో రొయ్యల చెరువులుగా మారిపోయాయి.

మరో వైపు ఆక్వా, ఆక్వా అనుబంధ పరిశ్రమలకు రాష్ట్రంలోనే కాదు దేశంలోనే జిల్లా ప్రధాన కేంద్రంగా మారింది. మరోవైపు 2000 సంవత్సరం నుంచి జిల్లాలో చెరువులకు అనుబంధంగా రొయ్య పిల్లలను సరఫరా చేసే హేచరీలు, ఫీడ్ కంపెనీలు కూడా ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఏడు ప్రధాన హేచరీలు ఉన్నాయి.

వైరస్‌తో రొయ్యకు గండం

రొయ్యకు ఎక్కువగా డబ్ల్యూఎస్ఎస్‌వీ (వైట్ స్పాట్) వైరస్, విబ్రియో బ్యాక్టీరియా, వైహెచ్‌వీ (ఎల్లోహెడ్ వైరస్), డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీఓ), ప్రస్తుతం వర్షాకాలంలో వైట్ స్పాట్ వైరస్ సోకుతోంది. రొయ్యల సాగులో మొదటి నుంచి 60వ రోజు వరకు బరువు పెంచడం కోసం మేతను పిల్లెట్స్ రూపంలో వేస్తుంటారు. 1-15 రోజుల వరకు ఒక రకంగా.. అలా ప్రతి 15 రోజులు పరిమాణం పెంచడానికి మేతను అధికంగా వినియోగిస్తుంటారు. స్వదేశీ కంపెనీ మేత ధరలు పదేళ్ల క్రితం 25 కేజీల బస్తా రూ.1,650 ఉండగా ప్రస్తుతం ధర రూ.2,500కు చేరింది. ఇక విదేశీ కంపెనీ మేతలు కూడా రాష్ట్రంలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. మన ధరలతో పోల్చితే కొంత ఎక్కువ. ఎకరాకు సరాసరి రెండు లక్షల పిల్లను సాగు చేస్తున్నారు.

ఎగుమతులు ఇలా

గత ప్రభుత్వంలో సాగుకు, ఎగుమతి వ్యాపారులకు ప్రోత్సాహం లేక ఎగుమతులు ఆశాజనకంగా లేని పరిస్థితి. కరోనా అనంతరం ఎగుమతి మార్కెట్ మళ్లీ పుంజుకుంది. జిల్లా నుంచి భీమవరం, నర్సాపురం ప్రధాన కేంద్రాలుగా అమెరికా, చైనాతో పాటు యూరోపియన్ దేశాలకు రొయ్యలు ఎగుమతులు జరుగుతున్నాయి. అప్పడా అధికారిక లెక్కల ప్రకారం 2017-18లో 1.52 లక్షల మెట్రిక్ టన్నులు, 2018-19లో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, 2019-20లో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 3.05 లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతులు జరిగాయి. గతేడాది 3.05 లక్షల మెట్రిక్ టన్నుల్లో 1.37 లక్షల మెట్రిక్ టన్నులు అమెరికాకు, లక్ష మెట్రిక్ టన్నులు చైనాకు, 65 వేల మెట్రిక్ టన్నులు యూరోపియన్ దేశాలకు మన జిల్లా నుంచి ఎగుమతులు జరిగాయి. ఆక్వా వ్యాపారుల సమాచారం మేరకు రాష్ట్రం నుంచి ఎగుమతి జరిగే వ్యాపారంలో 50 శాతం పశ్చిమగోదావరి జిల్లా నుంచే ఉంటుందని, గతేడాది రికార్డు స్థాయిలో సుమారుగా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతులు జరిగాయని, దీనిలో సుమారు రూ.9 వేల కోట్ల ఎగుమతి మార్కెట్ జరిగిందని అంచనా.

ఆక్వా రైతులకు ప్రభుత్వం అండ



ఆక్వా రైతులకు ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తోంది. ధరలు, ఫీడ్ విషయంలో రైతులు నష్టపోకుండా అన్ని చర్య తీసుకున్నాం. ఫీడ్ నాణ్యతను పరిశీలించడంతో పాటు ఎగుమతి మార్కెట్ మరింత పెరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది.

– వడ్డి రఘురాం, అప్సడా వైస్ చైర్మన్

విద్యుత్ ధరల్లో రాయితీతో ఊరట



ఆక్వా సాగు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం రైతులకు విద్యుత్ ధరల్లో రాయితీ కల్పించడంతో కొంత ఊరట లభిస్తోంది. నాణ్యమైన ఫీడ్ లభించడంతో పాటు వాతావరణం అనుకూలిస్తే రైతులకు డాలర్ల పంట పండినట్టే.

– నంద్యాల సీతారామయ్య, ఆక్వా రైతు, కుప్పనపూడి

బాలుడిని బలిగొన్న ఈత సరదా

- తమ్మిలేరులో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి
- బలివే వెంకటాపురంలో వద్ద ఘటన



తమ్మిలేరులో గాలిస్తున్న దృశ్యం



శ్రీబాబు మృతదేహం

ముసునూరు: ఈత నేర్చుకోవాలన్న సరదా ఓ విద్యార్థి నిండుప్రాణాన్ని బలిగొంది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బలివే శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన నలుగురు బాలురు వాలం సంతోష్, వాలం సంజయ్, కొండవీటి రాజా, నర్రా శ్రీబాబు (17) స్నేహితులు. వీరిలో వలం సంతోష్ కొండవీటి రాజా ఏలూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, శ్రీబాబు ఏలూరులోని మరో ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అలాగే వాలం సంతోష్ తమ్ముడు వాలం సంజయ్ ధర్మాజీగూడెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం స్కూళ్లకు సెలవు కావడంతో మధ్యాహ్నం వీరంతా గ్రామానికి సుమారు అరకిలోమీటరు దూరంలో ఉన్న తమ్మిలేరు చెక్ డ్యామ్ వద్ద ఈత నేర్చుకునేందుకు నీటిలో దిగారు. ఈ క్రమంలో ఈత నేర్చుకుంటూ ప్రమాదవశాత్తు లోతులో చిక్కుకున్నారు. ముగ్గురు ఒడ్డుకు చేరుకోగా, నర్రా శ్రీబాబు మునిగి గల్లంతయ్యాడు. బాలురు ఈ విషయాన్ని స్థానికులకు తెలియజేశారు., సమాచారం అందుకున్న తహసీల్దార్ దాసరి సుధ, నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్, సీఐ ఆర్.అంకబాబు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో శ్రీబాబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించారు. గాలింపు ముమ్మరం చేయగా చెక్‌డ్యామ్ గోడ దగ్గర లోతట్టు ప్రదేశంలో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు

తమ్మిలేరులో మునిగి బాలుడు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. చేతికంది వచ్చిన కుమారుడు దూరం కావడంతో శ్రీబాబు తల్లిదండ్రులు నర్రా శ్రీను, దేవిశ్రీ కన్నీరు మున్నీరుగా విలపించారు. తమ కొడుకు ఎదిగిన తరువాత ఏదోక ఉద్యోగం చేసి తమకు అండగా ఉంటాడనుకుంటే అర్థాంతరంగా కానరానిలోకాలకు వెళ్లిపోయాడంటూ రోదించారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : కస్పా పెంటపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పాలకోడేరు : విస్సాకోడేరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో జన్మించిన మగ బిడ్డ

వీరవాసరం: పురిటి నొప్పులతో ఉన్న ఓ గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి. వీరవాసరం గ్రామానికి చెందిన బి.రేఖ కుమారి వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ కోసం ఆసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో బిడ్డ పేగు మెడలో వేసుకుని ఉన్న కారణంగా ఆమెను మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. 108 అంబులెన్స్‌లో ఆమెను తరలిస్తుండగా మధ్యలోనే సుఖప్రసవం జరిగి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ బి.ప్రశాంతి, పైలెట్ బి.సూర్యనారాయణ పేర్కొన్నారు. అంబులెన్స్ సిబ్బందిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

మనస్తాపంతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

భీమడోలు/ఏలూరు: ఇంటి డ్రెయిన్ పైపులైన్ పనులను అడ్డుకున్నాడని ముగ్గురు యువకులు దాడి చేసి కొట్టడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పూళ్లలో ట్రాక్టర్ డ్రైవర్ గోకరకొండ కాళీకృష్ణ ఇంటి ఎదురుగా దోనే శ్రీనివాసరావు, దోనే కిషోర్ కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటి డ్రెయినేజీ నీరు బయటకు పోయేలా ఈ నెల 27న పంచాయతీ సిమెంట్ రోడ్డును తవ్వి పైపులు అమర్చే పనులను కాళీకృష్ణ అడ్డుకున్నాడు. దీంతో వీరు కాళీకృష్ణతో గొడవపడ్డారు. అదేరోజు వీరు మరో వ్యక్తి పచ్చా బాబితో కలిసి మద్యం తాగి కాళీకృష్ణపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. తీవ్ర మనస్తాపానికి గురైన కాళీకృష్ణ శుక్రవారం తెల్లవారుజామున తన ఇంటిలోని పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాళీకృష్ణపై దాడి చేసిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి అన్నదమ్ములు గోనే శ్రీనివాసరావు, దోనే కిషోర్‌లను అరెస్ట్ చేశామని, మరో నిందితుడు పచ్చా బాబి పరారీలో ఉన్నాడని ఎస్సై చావా సురేష్‌కుమార్ శనివారం చెప్పారు.

వైద్యురాలికి టోకరా

- సైబర్ పోలీసులమంటూ బెదిరింపు ఫోన్ కాల్
- గూగుల్ పే ద్వారా రూ.2.93 లక్షల అపహరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యురాలిని సైబర్ పోలీసులంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా బెదిరించి గూగుల్‌పే ద్వారా రూ.2.93 లక్షలను తమ అకౌంట్లకు వేయించుకుని మోసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. సీత ఆసుపత్రి వైద్యురాలు కె.శ్రీదివ్యారెడ్డికి ఈ నెల 22న ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫెడ్ఎక్స్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీసు నుంచి చేస్తున్నట్లు ఫోన్ చేశాడు. శ్రీదివ్యారెడ్డి అనధికారికంగా కొరియర్లు పంపిస్తున్నారని, ఇది చాలా పెద్ద నేరం బెదిరించాడు. అనంతరం ఆ కాల్‌ను ముంబై సైబర్ క్రైమ్ సెల్‌కు ఫార్వర్డ్ చేస్తున్నామని లైన్‌లో ఉండాలని, అక్కడి నుంచి మరో వ్యక్తి తాను పోలీసు ఆఫీసర్‌ని పరిచయం చేసుకుని మాట్లాడాడు. శ్రీదివ్యారెడ్డికి ఉన్న రెండు బ్యాంకు అకౌంట్‌లపై మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయని బెదిరించాడు. అనంతరం ఈ కేసు విచారణ అధికారి ఫోన్ చేస్తారని చెప్పారు. అనంతరం మరొక వ్యక్తి స్కైప్ యాప్ ద్వారా వెరిఫికేషన్ నిమిత్తం శ్రీదివ్యరెడ్డి ఆధార్ కార్డు, ఐడీకార్డు, బ్యాంకు అకౌంట్స్ వివరాలు శ్రీదివ్యారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కోడ్ అమౌంట్ నిమిత్తం ప్రతి బ్యాంకు అకౌంట్ నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నాడు. దీంతో శ్రీదివ్యారెడ్డి తన యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.98,888, అలాగే యూనియన్ బ్యాంకు అకౌంట్ నుంచి రూ.98,888, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి రూ.95,499 మొత్తం రూ. 2,93,275 గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. తరువాత అటు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన శ్రీదివ్యారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్‌బాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

దెందులూరు: సత్యనారాయణపురం - దెందులూరు మధ్య జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కారు డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన మహ్మద్ సాహెబ్ (24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మచిలీపట్నం నుంచి ద్వారకాతిరుమల వెళుతుండగా సత్యనారాయణపురం సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి కారు ఆపాడు. అనంతరం కారు వద్దకు వస్తుండగా ఏలూరు నుంచి రాజమండ్రి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహ్మద్ సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఐ.వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. డైమండ్స్ ఆధ్వర్యంలో శనివారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో కె.సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. మునగాల జితేంద్రదే వృద్ధులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రా ఆంజనేయస్వామి, సూర్యచంద్రరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సేవా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీటీ): స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని సమాజంలో సాటి ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేస్తున్న సేవలను గుర్తించి ఆదర్శ అవార్డులతో సత్కరిస్తున్నట్లు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగుబ్జి తెలిపారు. ఆగస్టు 7వ తేదీ లోపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారి వద్ద నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన శనివారం వెల్లడించారు. అవార్డుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవ, మదర్ థెరిసా సేవ, వివేకానంద సేవ, అబ్దుల్ కలాం సేవ అవార్డులను అందజేస్తామని వెల్లడించారు. దరఖాస్తులు పంపేవారు, మరిన్ని వివరాలు కోసం ఫోన్ నెంబర్ 63056 83467ను సంప్రదించాలని కోరారు.


ఆదర్శ సేవా సంస్థ అధ్యక్షుడు రొక్కాల

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీటీ): ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. విష్వక్సేన పూజ, మూల విరాట్ లక్ష్మీనారాయణకు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, ఫలరసాలతో విశేషంగా అభిషేకాలు అర్చకులు సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సంఘ ట్రెజరర్ నున్న బాల త్రిపుర సుందరరావు, సెక్రటరీ ఆలపాటి కృష్ణమోహన్ తదితరులు పర్యవేక్షించారు.


లక్ష్మీనారాయణ స్వామి

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

అత్తిలి: ఈదూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చకులు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించి, మొక్కులను తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.


ఈదూరులో శ్రీవరాల వెంకటేశ్వరస్వామి

ప్రభుత్వ న్యాయవాది దశక మురళీకృష్ణ


మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న లాయర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీటీ): ప్రభుత్వ న్యాయవాదిగా పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది దశక మురళీకృష్ణను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ మురళీకృష్ణ న్యాయ సలహాదారునిగా వ్యవహరించారు. దశక మురళీకృష్ణ నియామకం అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు న్యాయ వివాద అంశాలపై మంత్రివర్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో విజేత మురళీకృష్ణను బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందించారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

- ఇంటింటికి తిరిగిన సచివాలయ వ్యవస్థ...
- తణుకు మునిసిపాలిటీ పరిధిలో 29,766 ధ్రువపత్రాలు జారీ


తణుకు 18వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు (ఫైల్)

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందాలనే ఉద్దేశ్యంతో నెలరోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యింది. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లో ఉన్న 27 సచివాలయాల పరిధిలో ఈనెల 27వ తేదీతో ముగిసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జల్లెడ పట్టేశారు...

సచివాలయ వ్యవస్థలోని వార్డు సెక్రటరీలు, వలంటీర్లు తమ తమ పరిధిలోని ప్రతి ఇంటి గడపలోకి వెళ్లి వారికి సంక్షేమం అందుతుందా లేదా ఇంకెవరైనా అర్హులు మిగిలి ఉన్నారా అని జల్లెడ పట్టేశారు. ప్రతి ఇంట్లోను ఇంకేమైనా లబ్ధి చేకూరాల్సి ఉందేమోనని ఆరా తీశారు. ఇదే కార్యక్రమంలో 11 రకాల ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ ధ్రువపత్రాలతోపాటు రేషన్ కార్డుల్లో సవరణలు సైతం ఉచితంగా అందజేశారు. గడపలోకి వెళ్లి మరీ ధ్రువపత్రాల తాలూకా వివరాలు సేకరించి టోకెన్ అందచేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో వీటిని పంపిణీ చేశారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో వలంటీర్లు, సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి 30,325 అర్జీలకు టోకెన్లు ఇచ్చి 98.16 శాతంతో 29,766 ధ్రువపత్రాలు అందచేయగా మిగిలినవి వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రజానీకం సైతం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న సురక్ష మంచి కార్యక్రమం...



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేసింది. సచివాలయ వ్యవస్థ గతంలో గుర్తించలేని వారికి సైతం ఈ కార్యక్రమం ద్వారా మంచి జరిగింది. ముఖ్యంగా 11 రకాల సేవల్లో భాగంగా సంబంధిత ధ్రువపత్రాలు ఒక్కరోజులోనే అందజేశాం. ప్రభుత్వ ఆదేశాలతో పాటు మంత్రివర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచనల మేరకు అధికారుల కసనస్సుల్లో సచివాలయ వ్యవస్థ ఎంతో ధీటుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసింది.
– కేటీ సుధాకర్, తణుకు మునిసిపల్ కమిషనర్

రేషన్ కార్డుల్లో సవరణలు చేయించుకున్నా...



గతంలో మునిసిపాలిటీ, రెవెన్యూ కార్యాలయాల నుంచి ఏదైనా ధ్రువపత్రాలు పొందాలంటే తిరగలేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థ ద్వారా ఆ ఇబ్బందులు తొలగాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మా రేషన్ కార్డుల్లో ఉన్న మార్పులను సరిచేయించుకుని కొత్త కార్డును ఉచితంగా పొందడం సంతోషంగా ఉంది.
– పేపకాయల రాధ, తణుకు

సెక్రటరీలు, వలంటీర్లు ఇంటింటికీ వచ్చారు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు, సెక్రటరీలు ఇంటింటికీ వచ్చి సంక్షేమ పథకాలు అందుబాటులో ఎవరైనా మిగిలిపోయారా అని ఆరా తీశారు. అందులో భాగంగానే ప్రజలకు అవసరమైన కొన్ని ధ్రువపత్రాలు ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుని మరీ అందచేశారు. మా రేషన్ కార్డులో కొన్ని సవరణలు చేయించుకుని ఉచితంగా కొత్త రేషన్ కార్డును అందుకున్నాను. ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది.
– వి.లత, తణుకు

వలంటీర్లకు వందనం

ఠంచన్‌గా సంక్షేమ పథకాలు



నా పేరు మైలవరపు కనకలక్ష్మి. నేను తాడేపల్లిగూడెం ఎల్.అగ్రహారంలో నివసిస్తున్నాను. మా వలంటీర్ మంగాల దుర్గ అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ఆయా సమయాల్లో వలంటీర్ ఇంటికే వచ్చి పథకానికి కావలసిన పత్రాలను తీసుకెళ్తున్నారు. ఆ ప్రకారం ఠంచన్‌గా ఇంటి వద్దనే పథకాలు అందుతున్నాయి. వలంటీర్లు ఉండటంతోనే ఇది సాధ్యమవుతుంది.
– మైలవరపు కనకలక్ష్మి, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం

వలంటీర్ అండగా నిలిచింది



నా పేరు కోలా లక్ష్మీదుర్గ. నేను తాడేపల్లిగూడెంలో నివసిస్తున్నాను. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వలంటీర్ల సేవ లందిస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ వలంటీర్ కుంజాల రాటాలు ప్రాణాలకు తెగించి అందించిన సేవలు మరువలేనివి. గత ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా వలంటీర్ల ద్వారా సహాయ కార్యక్రమాలు జరిగాయి. కోవిడ్ కష్టకాలంలో, బాధితులు కోలుకోవడానికి వలంటీర్ వ్యవస్థ ఎంతగానో ఉపకరించింది.
– కోలా లక్ష్మీదుర్గ, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కె.పెంటపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కె. పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కె. పెంటపాడు గ్రామంలో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గడపగడప కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. జగనన్న చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. 2004లో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధే తప్ప కె. పెంటపాడులో అభివృద్ధి శూన్యమన్నారు. కనీసం పంచాయతీ గ్రామంలో వీధిదీపాల నిర్వహణ, డ్రైనేజీల శుభ్రత, సాధారణ చిన్న పాటి సమస్యలు కూడా పట్టించుకోక పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిలకంపాడు లాకుల నుంచి దేవరపల్లి గూడెం వైఎస్సార్ యూనివర్శిటీవరకు రూ. 45 కోట్లతో నాలుగులైన్ల రహదారులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీంతో పాటు, పెంటపాడు విప్పర్రు రహదారి, అత్తిలి– అలంపురం రహదారి కోసం కోట్లాది రూపాయల నిధులు అందిస్తున్నట్లు కొట్టు సత్యనారాయణ తెలిపారు. చంద్రబాబు ప్రజల్ని మోసం చేసేందుకు నాటకాలు ఆడుతున్నాడన్నారు. 2019లో ప్రజలు చెప్పులతో కొట్టినట్లు చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. జన్మభూమి కమిటీలతో పేద టీడీపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుందని విమర్శించారు. జగన్ నాయకత్వం రాష్ట్రానికి అవసరమని ప్రజలు గుర్తించినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, కె. పెంటపాడు గ్రామ సర్పంచ్ పీతల సత్యనారాయణ, మేడపూరెడ్డి బొమ్మినాయుడు, వీరబాబులు దానయ్య, వోడగిరి దిన బాబు, ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, నరాలశెట్టి సోమేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు చాందిన్, శేషు, మార్తపూడి రాము, ఉండ్రాజవరపు రాజు, దొడ్డిగర్ల చంద్రయ్య, మిరియాల బాన్నరరావు, ఎంపీపీ దాసరి హైమావతి, మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, సొసైటీ అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి సంతాపం


తణుకులోని గుబ్బల నరసింహారావు మృతదేహానికి సందర్భంగా నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన బీసీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుబ్బల రామారావు (74) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుబ్బల నరసింహారావు మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు శనివారం తణుకు వేమవరంలోని నరసింహారావు నివాసం వద్ద భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారావు తనకు అత్యంత సన్నిహితంగా మెలిగారని, ఆయన మృతి బీసీ కమ్యూనిటీకి తీరనిలోటని మంత్రి కారుమూరి పేర్కొన్నారు. నరసింహారావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు కురిపూడి చంద్రావు, గుబ్బల సూర్య చంద్రరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పాలంగి గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, కేసావరం గ్రామ సర్పంచ్ రామకృష్ణ, ద్వారకా తిరుమల దేవస్థానం ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బీసీలను వేధించడం తగదు

జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి


వేల్పూరులో బీసీల రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీటీసీ అన్నపూర్ణాదేవి

తణుకు టౌన్: వేల్పూరు గ్రామంలో బీసీ కులాలు నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు టీడీపీ పాలనలోని పంచాయతీ పాలకవర్గం, టీడీపీ నాయకులు అడ్డుపడుతూ వేధింపులకు దిగడం దారుణమని తణుకు జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి చెప్పారు. శనివారం వేల్పూరు గ్రామంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో రెండో రోజు గ్రామానికి చెందిన అగ్ని కుల క్షత్రియులు దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ అన్నపూర్ణాదేవి మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలోని టీడీపీ నాయకులు బీసీల పట్ల వివక్షను వీడనాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వేల్పూరు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, తణుకు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు చంద్ర శ్యామల, వైస్ ఎంపీపీ వెలిశెట్టి శేషుకుమారి, వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకటభూషణం, ఎంపీటీసీల రెడ్డి హైమా, వెంకట లక్ష్మి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, కోనాల సర్పంచ్ మల్లిపూడి చిన్నయ్య, ముద్దాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు తమరాపు సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు తిరుమాని నాగేశ్వరరావు, మల్లాడి మాధవకృష్ణ, వాటాల సత్తిరాజు, చింతా సత్యనారాయణ, తాడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

3న గూడెంలో శాంతియుత నిరసన ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో ఈనెల 3వ తేదీన ఉదయం 9 గంటలకు స్టానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సెంటర్ నుంచి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లోని క్రైస్తవులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చీడపీడలపై అవగాహన పెంచుకోవాలి


చీడపీడలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

పెంటపాడు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ పేర్కొన్నారు. గూడెం జోన్ పరిధిలోని పెంటపాడు యూనిట్ పరిధిలో అలంపురం గ్రామంలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజామృతం, జీవామృతం తదితర ద్రావణాల వల్ల చీడపీడలను నివారించుకొనే విధానం రైతులకు తెలిపారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం బీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకొంటే పంటను అధిక శాతం చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ గ్రామ వలంటీర్లు, ప్రతినిధులు గ్రామ రైతులు, ఐసీఆర్‌పీలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: పెంటపాడు మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల గృహ సారథుల కన్వీనర్ మైలవరపు పెదకాపులు తెలిపారు. మౌంజిపాడు, ఉమామహేశ్వరం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే గడపగడప కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి


పెంటపాడు ఆసుపత్రి సలహాసంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

పెంటపాడు: ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి తెలిపారు. శనివారం పెంటపాడు ఆస్పత్రి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రిలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి పలు పీహెచ్‌సీలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. బోధకాలు వ్యాధి సోకకుండా మందుల్ని వాడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తోట రాజేష్, పెంటపాడు, మౌంజిపాడు గ్రామ సర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, మైలవరపు స్వర్ణలత, తహసీల్దార్ జీవీ శేషగిరి, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన సంక్షేమానికి చిరునామా

ఇరగవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన ప్రజా సంక్షేమానికి చిరునామా అని ప్రజలు నూటికి నూరుశాతం నమ్ముతుంటారని ఇరగవరం వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రేలంగి గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పులపు అనిల్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేబ్రోలు రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ చేకూర్చని లబ్ధిని రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేకూర్చారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ గాలికొదిలేశారన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావును విమర్శించే అర్హత జనసేన నాయకులకు లేదని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సీపీ నాయకులు వడ్డీ మార్కండేయులు, సొసైటీ అధ్యక్షుడు నడంపల్లి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీలు, మెట్ల కిరణ్బాబు, దాసి రెడ్డి మహలక్ష్మి, నాయకులు గాదిరాజు బుజ్జి, రాట్నాల రమణ, మెట్ల రాజేష్, దొమ్మ మురళీ కృష్ణ, పెన్మెత్స కృష్ణంరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ నిధుల మంజూరు

పెంటపాడు: కె. పెంటపాడులో శాశ్వత తాగునీటి సమస్యకు రూ. 71 లక్షల జల్‌జీవన్ నిధులు మంజూరు చేసినట్లు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం రాత్రి గ్రామంలో మాట్లాడుతూ వెంకయ్య వయ్యేరు నుంచి నేరుగా శుద్ధి చేసి జలాలను అందించేందుకు ఈ నిధులు వాడతామన్నారు. పంచాయతీ అన్ని సౌకర్యాలు కల్పించేలా ఇల్లు నిర్మించుకొనేందుకు అభివృద్ధి సొమ్ములు పంచాయతీకి చెల్లించాలని ప్రజలకు సూచించారు. తొలుత గ్రామంలోని ప్రసిద్ధి చెందిన వైరాగిమఠం గోపాలస్వామిని మంత్రి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో గ్రామస్తుల కోసం ఏర్పాటు చేస్తున్న కళ్యాణ మండపాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఈవో సాయిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై శ్రద్ధ అవసరం


ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కంటి సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నేత్ర వైద్యురాలు లక్ష్మీ ప్రసన్న అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చినఅమిరం గ్రామ ప్రజలకు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు జయంతి సందర్భంగా కళాశాల అసోసియేషన్, ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో చినఅమిరంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠలరంగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య, కేఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.